



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 578 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 06 గురువారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం


## కృష్ణా నదిపై హై లెవెల్ వంతెనతో దీవుల్లోని

# గ్రామాలు అనుసంధానం

- రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు, సాస్కీ పథకం నిధులు మంజూరుకు నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వ సాయంతో అవనిగడ్డ పరిధిలో అవుట్ ఫాల్ స్లూయిజ్ ల పునరుద్ధరణ
- నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు
-అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిన అభివృద్ధి పనులకూ మోక్షం
- మొంథా తుపానులో నష్టపోయిన కౌలు రైతుల వివరాలతో నివేదిక
- తుపాను నష్టం, అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం



మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 05 : కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఎదురుమొండి దీవులవాసుల చిరకాల కల ఏటిమొగ, ఎదురుమొండి హై లెవల్ వంతెన నిర్మాణాన్ని సాకారం చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోపాటు సాస్కీ పథకం నుంచి నిధులు సమకూరుస్తామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో అవుట్ ఫాల్ స్లూయిజ్ ల పునరుద్ధరణకు తక్షణం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కృష్ణా జిల్లా, అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు, నియోజకవర్గ అభివృద్ధి తదితర అంశాలపై మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి, శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు . కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవనిగడ్డ ప్రాంతంలో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్ ల సమస్యకు పరిష్కారం చూపుతానని చెప్పారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిపోయిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంపైనా ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## బిజెపిలో త్వరలోనే

# బిఆర్ఎస్ విలీనం

ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది



హైదరాబాద్,నవంబర్5 : బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు.




## నిరుపేద కుటుంబాలకు అండగా

# మచ్చా గంగాధర్ (ఎంజిఆర్)


కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 05 : జనసేన అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ ఆశయాల మేరకు, కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ ల ఆశయాలకు అనుగుణంగా జనసేన సీనియర్ నాయకుడు మచ్చా గంగాధర్ (ఎంజిఆర్) పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కాకినాడ జగన్నాధపురంలోని 14వ డివిజన్ లో ఇటీవల మృతి చెందిన కర్రి చిన్న కుటుంబ సభ్యులను బుధవారం ఉదయం కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయిందని తెలుసుకున్న జనసేన సీనియర్ నాయకుడు మచ్చా గంగాధర్ (ఎంజిఆర్) వారి కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. ఇప్పటి వరకు 304 మందికి తన శక్తి మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మచ్చా గంగాధర్ (ఎంజిఆర్) మాట్లాడుతూ పది మందికి సేవ చేయడంలో వచ్చే తృప్తి తనకు చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. కాకినాడ పట్టణంలోనే కాక, పిఠాపురం, కాకినాడ రూరల్, అలాగే కాకినాడ జిల్లాలో ఎక్కడైనా ఆపదలో ఉంటే తనకు తెలిసిన



మరుక్షణం స్పందించి, తనవంతు సహాయం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు పొన్నాడ



నాగేశ్వరరావు, జనసేన పార్టీ వీర మహిళలు బంటు లీల, రచ్చ ధనలక్ష్మి, మోనా, సుజాత, దీప్తి, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు





# ప్రజల అభిప్రాయాలకు తగ్గట్లుగా పరిపాలించడమే మా ప్రభుత్వ ధ్యేయం

## -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు-కందుకూరు సింగరాయకొండ రాత్రిపూట బస్సు సర్వీసు ప్రారంభం

కందుకూరు,
ప్రజల అవసరాలను గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా పరిపాలించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు..
కందుకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో నందు ఈరోజు అనగా బుధవారం సాయంత్రం కందుకూరు సింగరాయకొండ రాత్రిపూట తిరిగే బస్సు సర్వీస్ ను ఆర్టీసీ అధికారులతో జెండా ఊపి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ప్రారంభించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 8 సంవత్సరాల క్రితం బస్ సర్వీస్ ఉండేదని, తరువాత దాన్ని ఆపివేయడం జరిగిందని, ఇప్పుడు తిరిగి ప్రజల సౌకర్యం కోసం కందుకూరు సింగరాయకొండ రాత్రిపూట బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు.. కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ప్రజల అవసరాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు.కందుకూరు నియోజకవర్గం లో ఎక్కువ మంది సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గాన్ని ఎంచుకుంటారని వారు సింగరాయకొండ రైల్వే స్టేషన్ లో



రాత్రిపూట దిగిన తర్వాత కందుకూరు నియోజకవర్గం రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలు నా దృష్టికి తీసుకువచ్చిన మరుక్షణం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తక్షణం బస్సు సర్వీసు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగిందని తెలిపారు.ఈ బస్సు సర్వీస్ తిరిగి ప్రారంభించినందుకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకి ప్రజలు అభినందనలు తెలియజేశారు.ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి తెలుగు నాడు కార్మిక సంఘం నాయకులు, ఆర్టీసీ అధికారులు ఘన స్వాగతం




పలికారు...ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, కూనం నరేంద్ర, షేక్ మున్నా, ముచ్చు శ్రీనివాసరావు, మురారిశెట్టి సుధీర్, కొత్తూరి వెంకట సుధాకర్, షేక్ రూబీ, మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణా నదిపై హై లెవెల్ వంతెనతో దీవుల్లోని

# గ్రామాలు అనుసంధానం

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంత గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత వారం అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సమయంలో నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు కౌలు రైతులకు కూడా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఒక్క కృష్ణా జిల్లాలోనే 60 వేల మందికి పైగా సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నమోదు చేసుకోని కౌలు రైతుల సంఖ్య కూడా ఉంటుంది. నష్టపోయిన ప్రతి కౌలు రైతుని గుర్తించి వారికి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

**- గత ప్రభుత్వం నిర్లక్ష్యం ఖరీదు రూ.50 కోట్లు**

అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంతంలో కాలువలను సముద్రానికి అనుసంధానిస్తూ నిర్మించిన అవుట్ ఫాల్ స్లూయిజ్ లు పని చేయకపోవడం కారణంగా నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాలు ముంపుకు గురవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇవి పూర్తిగా పని చేయకుండాపోయాయి. గ్రీజ్ పెట్టడం వంటి కనీస నిర్వహణ పనులకు కూడా నోచుకోలేదు. ఫలితంగా అవుట్ ఫాల్ స్లూయిజ్ లు మొరాయించడం వల్ల సముద్రం పోటెత్తిన ప్రతిసారి ఉప్పు నీరు తమ పొలాలను ముంచెత్తుతుందని తమ సమస్యకు పరిష్కారం చూపవని దివిసీమ రైతులు కోరుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నేడు అవుట్ ఫాల్ స్లూయిజ్ లను పునరుద్ధరించేందుకు రూ.50 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు అవుట్ ఫాల్ స్లూయిజ్ లు పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జాతీయ విపత్తుల నిర్వహణ నిధుల నుంచి వీటికి కేటాయింపులు చేసి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. అవుట్ ఫాల్ స్లూయిజ్ ల సమస్య పరిష్కారానికి అవసరం అయితే ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడుతా. నూతనంగా నిర్మించబోయే అవుట్ ఫాల్ స్లూయిజ్ లు దీర్ఘకాలం రైతులకు ఉపయోగపడే విధంగా డిజైన్లు పక్కాగా రూపొందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- ఎదురుమొండి దీవుల వాసుల కల నెరవేరుస్తాం**

ఎదురుమొండి దీవుల్లో నివాసం ఉంటున్న 20 వేల మంది ప్రజల



చిరకాల వాంఛ ఏటిమొగ – ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తాం. కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఈ హైలెవల్ బ్రిడ్జ్ కోసం ఇప్పటికే రూ.109 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. అలైన్మెంట్ లో మార్పుల కారణంగా నిర్మాణ వ్యయం పెరిగిన విషయాన్ని స్థానిక శాసన సభ్యుడు తెలియచేశారు. రూ.60 కోట్లు వరకూ నిర్మాణ వ్యయం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు సాస్కీ పథకంతో నుంచీ తగిన నిధులు సమకూరుస్తాము. నిర్ణీత కాల వ్యవధిలో ఏటిమొగ %-% ఎదురుమొండి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తాం.

**- అటవీ అనుమతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి**

ఎదురుమొండి దీవుల పరిధిలో ఎదురుమొండి – గొల్లమంద మధ్య రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.13.88 కోట్లు కేటాయించాము. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. అయితే ఈ రోడ్డులో కొంత భాగం అటవీ శాఖకు చెందిన భూభాగం ఉంది. నాచుగుంటకు వెళ్లే రహదారి నిర్మాణం కూడా కొంత భాగం అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిపోయింది. అటవీ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి. కృష్ణా నది సముద్రంలో కలిసే హంసలదీవి పవిత్ర సాగర సంగమ ప్రాంతానికి ప్రజలు వెళ్లేందుకు అటవీ శాఖ కొంత రుసుము వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. హిందువులంతా ఈ ప్రాంతాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. వసూలు చేస్తున్న రుసుము తక్కువే అయినప్పటికీ భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కాబట్టి అటవీశాఖ అధికారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్, జిల్లా అటవీశాఖ అధికారులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం

ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కరిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు. అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపు కోసం కట్టుదిట్టంగా పనిచేయాలి...

**-శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.**

శేరిలింగంపల్లి, నవంబర్ 05 : –
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్ నగర్ సర్కిల్ లో ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , మాజీ పార్లమెంట్ సభ్యులు వి హనుమంత్ రావు సమక్షంలో జరిగిన భారీ రోడ్డు షో లో పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి నవీన్ యాదవ్ గెలుపు ఖాయం అని అన్నారు. కాలనీలలో, బస్తీలలో అందరి నోట హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ని గెలుపించుకుంటామని తెలిపినట్లు అన్నారు. విద్యావంతుడు యువతలో మంచి పేరు ఉన్న వ్యక్తి, జూబ్లీహిల్స్ నియోజకవర్గంను అభివృద్ధి పథంలో నిలబెట్టే సత్త ఉన్న నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలుపుంచుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో పని చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీందర్ యాదవ్, రాష్ట్ర యువజన అధ్యక్షులు గొర్ల యశ్వంత్ యాదవ్, సిటీ యూత్ అధ్యక్షులు విజయ్ యాదవ్, కోయ్యడ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బోర్డు సమావేశంలో పాల్గొన్న విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర.

అరకు, , నవంబర్ 05:
ఆంధ్రప్రదేశ్ విజయవాడలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణ ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ బోర్డు మీటింగ్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో విజయనగరం ఆర్టిసి రీజనల్ చైర్మన్ దొన్నుదొర అంశాలపై ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. ఆర్టీసీలో ఉన్న సమస్యలపై ఉద్యోగ భద్రత ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర,విజయవాడ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నెల్లూరు రీజినల్ చైర్మన్ సురేష్ రెడ్డి కడప రీజినల్ చైర్మన్ పూల నాగరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## నగరంలో 22 ఏ సమస్యని పరిష్కరించండి : ప్రియాంక దండి

సీతమ్మధార, నవంబర్ 05:
కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ని బుధవారం కలిసి గతంలో వి ఎం ఆర్ డి ఏ వేసిన లేఅవుట్ ప్లాట్స్, వుడా నుండి ఆక్షన్ లో కొన్న స్థలాలు కూడ 22%ఎ% లో పెట్టడం వల్ల అమ్ముకోవడానికి, బ్యాంక్ ఋణం తీసుకోవడానికి లేదా నిర్మాణాలు చేపట్టడానికి కుదరక ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్య పై వెంటనే ఒక నిర్ణయం తీసుకోవాలని ఆమె వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ని కోరారు.

## రాముని బండ జాతరకు పోటెత్తిన భక్తులు

నవంబర్ 05 జగదేవపూర్
జగదేవపూర్ మండలం జంగంరెడ్డి పల్లిలోని గ్రామ సమీపంలోని రామునిబండ జాతరకు భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు భారీగా బారులు తీరారు. కాగా దేవాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.శ్రీ రాముని బండ జాతర ఘనంగా జరిగాయి. ఈ జాతరకు వేలాది మంది భక్తులు వచ్చారు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా భక్తుల మధ్యలో కొలువైన సీతారామ చంద్ర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతిఏటా కార్తిక పౌర్ణమి రోజు నుండి రెండు రోజులపాటు ఘనంగా స్వామి వారి జాతర ఉత్సవాలు జరుగుతాయి. గుండంలో స్నానం చేస్తే సర్వ రోగాలు న్యాయమవుతాయని భక్తుల నమ్మకంతో గుండంలో నీళ్ల కోసం భక్తులు పోటుపడుతూ బకెట్ల సహాయం తో స్నానాలు చేశారు.


## మంత్రి లోకేష్ ని కలిసిన రాజోలు టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి

రాజోలు, నవంబర్ 5:
డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య నియోజకవర్గానికి ఇన్చార్జ్ గా నియమితులైన తరువాత మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ని మంగళగిరి నియోజకవర్గ ఉండవల్లిలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన అమూల్య లోకేష్ కి దుస్సాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుచూ నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై ఆయన ఆరా తీశారని,అనేక పార్టీ విషయాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు సుమారు 20 నిమిషాల పాటు మాట్లాడినట్లు, నియోజకవర్గం లోని అనేక అభివృద్ధి పనులను లోకేష్ దృష్టికి తీసుకువెళ్లినట్లుగా అమూల్య తెలియజేసారు.

# నవజనార్ధన స్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు దంపతులు.

ఆలమూరు, తూర్పుకిరణం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు లో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత నవ జనార్ధన స్వామి ఆలయానికి అయినవిల్లి అప్పన్నపల్లి ఆలయాల దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు హైమా పార్వతి దంపతులు బుధవారం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక మాసం కార్తీక పౌర్ణమి పర్వదిన సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు దంపతులు దర్శనానికి రావడంతో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు అంగర భగవాన్ ఆచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ టెస్ట్ బోర్డ్ సభ్యులు, బొబ్బా రాంబాబు, చిన్నం సుబ్బలక్ష్మి, డి విజయలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, తారా దుర్గ భవాని, కట్ట శ్రీనివాస్, కొప్పాడి జై బాబు, సబ్బవరపు రావమ్మా, తదితరులు పాల్గొన్నారు.

DGCA
DIRECT GUIDANCE IN CIVIL AVIATION INDIA



## నవ జనార్ధన స్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు దంపతులు

ఆలమూరు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 05 : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత నవ జనార్ధన స్వామి ఆలయానికి అయినవిల్లి, అప్పన్నపల్లి ఆలయాల దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు, హైమా పార్వతి దంపతులు బుధవారం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక మాసం కార్తీక పౌర్ణమి పర్వదిన సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు దంపతులు దర్శనానికి రావడంతో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్ ఆచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బొబ్బా రాంబాబు, చిన్నం సుబ్బలక్ష్మి, డి.విజయలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, తారా దుర్గా భవాని, కట్ట శ్రీనివాస్, కొప్పాడి జైబాబు, సబ్బవరపు రావమ్మా తదితరులు పాల్గొన్నారు

# ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలి

**ఎవరైనా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే చర్యలు తప్పవు**

**క్రమశిక్షణతో పని చేయండి. 15వ తేది లోపు గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ కమిటీల వరకు నియామకాలు పూర్తి కావాలి**

**కూటమి నాయకులతో సఖ్యతగా, సమిష్టిగా కలుపుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.**

**- పార్టీ నాయకులతో రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు టెలీ కాన్ఫరెన్స్**

గాజువాక, నవంబర్ 05:

నియోజకవర్గాల్లో సరిగ్గా గ్రీవెన్స్ నిర్వహించడం లేదని, నాయకులు ప్రజల సమస్యలు సరైన రీతిలో పరిష్కరించివుంటే మంత్రి లోకేష్ గారి ప్రజాదర్బార్ కు 4వేల మంది ఎందుకు వస్తారు అని నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు మండిపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పర్యటించిన ఆయన పార్టీ ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలతో ఆయన మాట్లాడుతూ.. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారి ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలి అని ఆదేశించారు. ఇక అదే రోజు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు. నవంబర్ 15వ తేది లోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామ స్థాయి కమిటీల వరకు పార్టీ నియామకాలు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. 15వ తేది లోపు పూర్తి చేయలేకపోతే జాతీయ అధ్యక్షులు ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అంటే ఒక సంస్కృతి. క్రమశిక్షణకు మారు పేరు తెలుగుదేశం పార్టీ. కొందరి నాయకుల వలన పార్టీకి చెడ్డపేరు వస్తుందని, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి నాయకులు వారి ప్రవర్తన మార్చుకోవాలని, మరలా పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో పార్టీ నాయకులు సఫలం కావాలి, దానికి తగ్గట్టు నియోజకవర్గాల్లో కార్యక్రమాల్లో నిర్వహిస్తూ.. క్యాడర్ ను కలుపుకుంటూ.. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని సూచించారు. కూటమి నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తుంది.. అందరూ సఖ్యతతో పనిచేయాలి.. సంయమనం పాటించండి.. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న



దుష్ప్రచారాలను తిప్పికొట్టండంతో పాటు వైసీపీ దుష్ప్రచారాలకు ప్రజలు ప్రభావితం కాకుండా వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పని చేయండని కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, పార్లమెంట్, నియోజకవర్గ ఇంచార్జులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ చలమలశెట్టి సురేంద్రనాథ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలి

మంగళగిరి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 05 : వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు చలమలశెట్టి సునీల్ తండ్రి సురేంద్రనాథ్ కన్నుమూశారని తెలిసి చింతించానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తెలిపారు. నిబద్ధతతో వైద్య సేవలు అందించిన చలమలశెట్టి సురేంద్రనాథ్ ఎందరో యువ వైద్యులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సురేంద్రనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని, ఆయన కుమారులు సునీల్, అనిల్ కుమార్, వెంకటేష్ ఇతర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# హసన్ బాద సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్- స్వచ్ఛ ఆంధ్ర

రామచంద్రపురం ,, నవంబర్ 5 మండలం లోని హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జెసిబి,ట్రాక్టర్ల సహాయంతో రోడ్ కు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించడం జరిగింది. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు స్వయంగా ట్రాక్టర్ నడిపి చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించడంలో సహకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వైభవం... శ్రీసత్యదేవుని గిరిప్రదక్షిణం ...!

**- గిరి చుట్టూ తిరిగే హృదయం సత్యదేవుని నిలయం**
**- సత్యదేవుని గిరి ప్రదక్షిణ సాక్షాత్తు ఆత్మ ప్రదక్షిణే**
**- 12.15 గంటలకు చినుకులు రాలి తెరపిచ్చిన వైనం**
**- గిరిప్రదక్షిణ భక్తులకు ఆధ్యాత్మిక కనువిందు**
**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే**

అన్నవరం, . నవంబర్ 5:


స్వామి, అమ్మ వార్ల దర్శనం, అనుగ్రహ భాగ్యం కలిగించి, భక్తుల జన్మ జన్మల పాపహరించి, దైవిక ఆశీర్వాదాలను ఇచ్చి, అంతర్గత శాంతిని, ఆధ్యాత్మిక, ఆత్మనిష్ఠను పెంపొందించి, శారీరక వ్యాయామ ప్రయోజనాలను అందించే శ్రీసత్యదేవుని గిరిప్రదక్షిణ ఆధ్యాత్మిక వైభవంగా విరాజిల్లింది. త్రిమూర్తి రూపక దైవం, భక్త సులభుడు, కోర్కెలు నెరవేర్చే దైవంగా అచంచల విశ్వాసాన్ని పెంచుకుని గిరిప్రదక్షిణలో పాల్గొన్న అశేష జనవాహినికి విశేష దర్శనం ఇస్తూ వీర వెంకట సత్యనారాయణస్వామి గిరిప్రదక్షిణ ఆద్యంతం కన్నుల పండుగగా సాగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి, రమాదేవి గిరిప్రదక్షిణ ఆధ్యాత్మిక వార్షిక యాత్రా కార్యక్రమం బుధవారం కార్తీక శుద్ద పౌర్ణమి రోజున అత్యంత వైభవంగా జరిగింది. తొలుత దేవస్థానంలో శ్రీస్వామి, అమ్మవార్లను పల్లకీలో సుఖాసీనులను చేసి దేవస్థానంపై ఊరేగిస్తారు. అలా ఊరేగిస్తూ ఉదయం ఉదయం 8.30 గంటల శుభ ముహూర్తపు ఘడియలకు దేవాలయం కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు పల్లకీలో తీసుకుని వచ్చారు. వేద పండితులు, దైవికులు ఇక్కడ వైదిక కార్యక్రమాలు, పూజాదికాలను, ప్రత్యక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాది సుగంధ, పరిమళ పుష్పాలతో సద్బ్రాహ్మణులు ప్రత్యేకంగా అలంకరించి తీర్చిదిద్దన మోటారు వాహన సత్యరథంలో శ్రీ స్వామిని, ఇష్ట సఖి ఆధ్యాది మహాలక్ష్మిని అత్యంత భక్తి శ్రద్ధలతో సుఖాసీనులు చేసారు. అనంతరం తొలి పావంచా నుంచే మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథం గిరిప్రదక్షిణ యాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఇక్కడ నుంచే సత్య రథం వెంట వేద పండితులు, పురోహితులు, ఆలయ సిబ్బంది, అశేష భక్త జన సంద్రం వెంట తరలి రాగా సకల శోభాయమానంగా మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో, తప్పెట్లు, తాళాలు, డప్పులు, రుంజ వాయిద్యాల శబ్ద విన్యాసాల నడుమ, స్వామి నామ స్మరణతో అశేష జనవాహిని రథాన్ని అనుసరించింది. అన్నవరం గ్రామ ప్రధాన రహదారిలో జాతీయ రహదారిలోని గ్రామ ముఖద్వారం వద్ద స్వాగత మండపం మీదుగా పడమర దిశన బెండపూడి వైపుగా గిరిప్రదక్షిణ కొనసాగింది. దారి పొడవునా స్వామి అమ్మ వార్లకు జయజయ నాదాలు పలుకుతూ సత్యరథానికి ముందు కొంత, వెనుక కొంత జనసమూహాలు తమ పాదాలు కదిపాయి. అలా అలా బెండపూడి సమీపంలోని పోలవరం గట్టు మార్గం, సత్యగిరి మీదుగా అన్నవరం వైపు కొండల తట్టు ప్రాంతాల మీదుగా గిరిప్రదక్షిణ యాత్ర పయనించింది. వేద పండిత అగ్రేసరుల నియమాల అనుసారం భక్తి,విజ్ఞాన, వినోద మనో రంజకంగా ఆసక్తికరంగా, నయన మనోహరంగా, వీనుల విందుగా గిరి ప్రదక్షిణ సజావుగా వేడుకగా ముందుకు కొనసాగింది. ఇలా రత్న, సత్యగిరుల చుట్టూ గిరిప్రదక్షిణ మార్గం 9.2 కిలో మీటర్ల మేర దూరం పొడవునా సుమారు 4 గంటల సమయం పాటు పైగా సాగిన యాత్ర ఆద్యంతం స్వామి, అమ్మ వార్లు స్వీయ గిరి ప్రదక్షిణం చేస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమ పాదరక్షలను విడిచి పాదయాత్రగా అనుసరించారు. చివరకు స్వామి, అమ్మ వార్లు దేవస్థానంపై స్వస్థానానికి చేరుకున్నాక స్వామి అమ్మ వార్లకు వేద పండితులు మంగళ హారతులు ఇచ్చారు. తదుపరి స్వామి అమ్మ వార్లను యధావిధిగా గర్భగుడిలో ప్రవేశ పెట్టడంతో గిరి ప్రదక్షిణ యాత్రా దైవ కార్యం ఫలప్రదంగా పరిపూర్ణం అయ్యింది. ఏదైనా పని తలపెట్టి నప్పుడు సత్యనారాయణ వ్రతం ఆచరిస్తే అనితర సాధ్యమైన మనోబలం సొంతం అవుతుందని చెబుతారు. కార్తిక మాసంలో త్రిమూర్తుల అభేదానుభవాన్నిచ్చే మీసాలరాయుని దర్శనం చాలా మంచిదని నమ్మకం. అందువల్ల



అన్నవరం రత్నగిరి ప్రదక్షిణ అత్యంత ప్రసిద్ధమైంది కావడంతో అశేష భక్త కోటి ఈ కార్తిక పౌర్ణమి గిరి ప్రదక్షిణలో భాగస్వామ్యమై తరించింది. గిరి ప్రదక్షిణలో పాల్గోడం వలన కొండపై వెలసిన దేవతామూర్తుల శక్తిని పొందగలుగుతామని చెబుతారు. కొండంతా నిండిన అనేక ఔషధ వృక్షాలు సాధకుడికి ఆరోగ్యభాగ్యాన్నీ, శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం, శక్తి, జ్ఞానం, ఆనందం ప్రదక్షిణతో లభిస్తాయని భక్తుల నమ్మకం. అన్నవరం గిరి ప్రదక్షిణ అశ్వమేధ యాగ ఫలాన్నిస్తుందని ఆధ్యాత్మికవేత్తలు విశ్వాసం. అందుకే సత్యదేవుని గిరిప్రదక్షిణలో ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు అత్యంత నియమనిష్టలతో, విశ్వాసంతో భాగస్వామ్యమై తరించారు.



# మోతీనగర్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం..



శేరిలింగంపల్లి, నవంబర్ 05 : – బోరబొండ డివిజన్ మోతీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బొడ్డు రవిశంకర్, గంగవరపు రామకృష్ణ ప్రసాద్, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా, బోరబొండ డివిజన్ పరిధిలోని మోతీనగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారం ఉత్సాహంగా, విజయవంతంగా సాగింది.ఈ కార్యక్రమంలో బొడ్డు రవిశంకర్, గంగవరపు రామకృష్ణ ప్రసాద్, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్, వారి బృందం , రంగారావు, సత్యం శ్రీరంగం, సాయి తులసి, రావిపాటి వెంకటేశ్వర్లు, యలమంచిలి వెంకట కృష్ణారావు, మందడి కోటేశ్వర రావు, బండ్ల రవీంద్ర బాబు, కొల్లి అనిల్ కుమార్, ఇరుకులపాటి నరసింహారావు, వేంకటేశ్వర రావు, కామినేని శ్రీనివాసు, వంశీ కృష్ణ, సతీష్, నాగసాయి, వినోద్, శ్రీహరి తదితర స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ప్రచార బృందం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుని, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం వ్యూహాత్మక చర్యలు, పారదర్శక పాలనను వివరించారు.ప్రచారంలో పాల్గొన్న నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలనివివరించారు. మహిళల కోసం ఉచిత బస్ ప్రయాణ సదుపాయం, ప్రభుత్వ ఆరోగ్య సేవల విస్తరణ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, గృహ సదుపాయాల మంజూరు ద్వారా ఆర్థిక భద్రతనాయకులు ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు పిలుపునిచ్చి, అభివృద్ధి, సమానత్వం, పారదర్శక పాలనకు సంకేతంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరల బలపరచాలని కోరారు.రాబోయే ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ని ఘన విజయం దిశగా నడిపించండి" అని వినూత్న ప్రచారం చేసారు.

# అసలైన 'దసరా బుల్లోడు' వి.బి.రాజేంద్రప్రసాద్!

హైదరాబాద్, సింహగర్జన సినిమా ప్రతినిధి, నవంబర్ 05 : తెలుగు చిత్రసీమలో ఎంతోమంది నిర్మాతలు తమ అభిరుచికి తగ్గ చిత్రాలను నిర్మించి, జనం మదిలో నిలచిపోయారు. అలాంటి వారిలో జగపతి ఆర్ట్ పిక్చర్స్ అధినేత వి.బి.రాజేంద్రప్రసాద్ స్థానం ప్రత్యేకమైనది. నిర్మాతగానే కాకుండా, దర్శకునిగానూ రాజేంద్రప్రసాద్ ఆకట్టుకున్నారు. 'జగపతి' బ్యానర్ కు జనం మదిలో ఓ తరిగిపోని స్థానం సంపాదించారు. తన చిత్రాలలో పాటలకు పెద్ద పీట వేసేవారు రాజేంద్రప్రసాద్. తరువాతి రోజుల్లో తన సినిమాల్లోని పాటలను కలిపి, కాసింత వ్యాఖ్యానం జోడించి, 'చిటపటచినుకులు' అనే మకుటంతో రెండు భాగాలుగా విడుదల చేసి, అలరించారు. ఈ తీరున ఆకట్టుకున్న నిర్మాత-దర్శకుడు మరొకరు కానరారు. వీరమాచనేని బాబూ రాజేంద్రప్రసాద్ 1932 నవంబర్ 4న జన్మించారు. కృష్ణాజిల్లా డోకిపర్రు గ్రామం ఆయన స్వస్థలం. ఆయన కన్నవారు లక్ష్మీనరసమ్మ, జగపతి చౌదరి. వ్యవసాయ కుటుంబం. ఆర్థిక బలం బాగుండేది. దాంతో రాజేంద్రప్రసాద్ చదువుకుంటూనే నాటకాలలో వేషాలు వేస్తూ, సినిమాలపై ఆసక్తి పెంచుకున్నారు. తరువాతి రోజుల్లో అభిరుచి గల నిర్మాతగా పేరొందిన 'శంకరాభరణం' ఏడిద నాగేశ్వరరావు ఆయనకు బాల్యమిత్రులు. వారిద్దరూ కలసి 'రాఘవ కళాసమితి' అనే సాంస్కృతిక సంస్థను నెలకొల్పి, ఆ బ్యానర్ పైనే నాటకాలు వేసేవారు. 'ఇన్ స్పెక్టర్ జనరల్' అనే నాటకంలో స్త్రీ పాత్ర ధరించి, ఉత్తమకథానాయికగా అవార్డునూ సంపాదించారు.

నటుడవ్వాలని మద్రాసు చేరారు రాజేంద్రప్రసాద్. అక్కడ తన అభిమాన హీరో ఏయన్నార్ ను కలుసుకున్నారు. ఆయన ప్రోత్సాహంతో కొన్ని సినిమాల్లో ప్రయత్నించారు. కానీ, ఫలితం లేకుండా పోయింది. దాంతో తన తండ్రి పేరిటి 'జగపతి ఆర్ట్ పిక్చర్స్' పతాకం స్థాపించి, తొలి ప్రయత్నంగా జగ్గయ్య కథానాయకునిగా, జమున నాయికగా 'అన్నపూర్ణ' చిత్రం నిర్మించారు. వి.మధుసూదనరావు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నిర్మాతగా రాజేంద్రప్రసాద్ కు మంచి పేరు సంపాదించి పెట్టింది.

తొలి చిత్రం 'అన్నపూర్ణ' కాగానే, తన అభిమాన కథానాయకుడు ఏయన్నార్ తో 'ఆరాధన' నిర్మించారు. ఆ సినిమా కూడా మంచి ఆదరణ పొందింది. అప్పటి నుంచీ ఏయన్నార్ తోనే సినిమాలు నిర్మిస్తూ సాగారు. అలాగే తన సినిమా టైటిల్స్ అన్నీ ఇంగ్లిష్ అక్షరం 'ఎ'తో ఆరంభమయ్యేలా చూసుకొనేవారు. "ఆత్మబలం, అంతస్తులు, ఆస్తిపరులు, అదృష్టవంతులు" వరకు వి.మధుసూదనరావు దర్శకత్వంలోనే చిత్రాలను నిర్మించారు రాజేంద్రప్రసాద్. తరువాత ఎడిటర్ ఎ.సంజీవి దర్శకత్వంలో 'అక్కాచెల్లెలు' నిర్మించారు. ఆపై ఏయన్నార్ ప్రోత్సాహంతో తానే డైరెక్టర్ గా మారి 'దసరాబుల్లోడు' నిర్మించారు. ఈ రంగుల చిత్రం 1971లో బ్లాక్ బస్టర్ గా నిలచింది. ఏయన్నార్ కు తొలి స్వర్ణోత్సవంగానూ 'దసరాబుల్లోడు' చరిత్రకెక్కింది. ఆ పై అక్కినేనితో "బంగారుబాబు, బంగారుబొమ్మలు, రామకృష్ణులు, ఎస్పీ భయంకర్, భార్యాభర్తల బంధం" వంటి చిత్రాలు నిర్మించి, దర్శకత్వం వహించారు. వీటిలో 'రామకృష్ణులు'లో యన్టీఆర్,



'భార్యాభర్తల బంధం'లో రామారావు తనయుడు బాలకృష్ణ ఏయన్నార్ తో కలసి నటించడం విశేషం.
శోభన్ బాబు హీరోగా "మంచిమనసులు, పిచ్చిమారాజు" చిత్రాలను రూపొందించారు రాజేంద్ర ప్రసాద్. తమిళంలో 'బంగారుబాబు' రీమేక్ గా 'ఎంగల్ తంగ రాజా' తెరకెక్కించి విజయం సాధించారు. హిందీలో 'దసరా బుల్లోడు' రీమేక్ గా 'రాస్తే ప్యార్ కీ' నిర్మించారు. అక్కినేని ఆనందరావు నిర్మించిన 'అందరూ దొంగలే' చిత్రానికి వి.బి.రాజేంద్రప్రసాద్ దర్శకత్వం వహించారు. హిందీలో విజయం సాధించిన 'విక్టోరియా 203'ఆధారంగా 'అందరూ దొంగలే' తెరకెక్కింది. తెలుగులోనూ మంచి ఆదరణ చూరగొందీ చిత్రం.
తరువాతి రోజుల్లో బాలకృష్ణ హీరోగా 'బంగారుబుల్లోడు' చిత్రాన్ని రవిరాజా పినిశెట్టి దర్శకత్వంలో నిర్మించగా, ఆ సినిమా ఘనవిజయం సాధించింది. నాగార్జున హీరోగా స్వీయ దర్శకత్వంలో వి.బి.రాజేంద్రప్రసాద్ 'కెప్టెన్ నాగార్జున' నిర్మించారు. తరువాత నాగ్ హీరోగా ఫాజిల్ డైరెక్షన్ లో 'కిల్లర్' రూపొందించారు. తనయుడు జగపతిబాబును హీరోగా పరిచయం చేస్తూ వి.మధుసూదనరావు దర్శకత్వంలో 'సింహస్వప్నం' నిర్మించారు. ఆ తరువాత తనయుడు హీరోగా 'భలే బుల్లోడు, పెళ్ళిపీటలు' వంటి చిత్రాలు తెరకెక్కించారు. ఆ సినిమాలేవీ అంతగా అలరించలేకపోయాయి. అప్పటి నుంచీ సినిమాలకు దూరంగా జరిగారు రాజేంద్రప్రసాద్.
హైదరాబాద్ లో తెలుగు చిత్రసీమ నెలకొనడానికి కృషి చేసిన వారిలో రాజేంద్రప్రసాద్ ఒకరు. ఫిలిమ్ నగర్ హౌసింగ్ సొసైటీకి ఆయన చాలా రోజులు ప్రెసిడెంట్ గా ఉన్నారు. ఆయన హయాములోనే ఫిలిమ్ నగర్ లో దైవసన్నిధానం నిర్మాణం సాగడం విశేషం. ఆ దేవస్థానానికి చివరి దాకా రాజేంద్రప్రసాద్ ఛైర్మన్ గా సేవలు అందించారు. 2015 జనవరి 15న వి.బి.రాజేంద్రప్రసాద్ తుదిశ్వాస విడిచారు. రాజేంద్రప్రసాద్ భౌతికంగా దూరమైనా, ఆయన చిత్రాల ద్వారా తెలుగువారి మనసుల్లో ఈ నాటికీ చెరగని ముద్ర వేసుకొనే ఉన్నారు.

# కమల్ హాసన్ నిర్మాతగా రజనీకాంత్ 173వ చిత్రం...

## -కోలీవుడ్ లో అల్టిమేట్ ప్రాజెక్ట్

తమిళ చిత్ర పరిశ్రమలో ఓ అద్భుతం ఆవిష్కృతం కానుంది. దశాబ్దాలుగా వెండితెరపై తమ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఇద్దరు దిగ్గజాలు కమల్ హాసన్, రజనీకాంత్ ఇప్పుడు కొత్త పాత్రల్లో చేతులు కలపనున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, లోకనాయకుడు కమల్ హాసన్ నిర్మాతగా ఓ భారీ చిత్రం రాబోతోంది. ఈ చారిత్రక ప్రాజెక్టను కమల్ హాసన్ నిర్మాణ సంస్థ 'రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్' నిర్మించనుంది.బుధవారం ఈ సంచలన ప్రకటన వెలువడింది. రజినీకాంత్ 173వ చిత్రంగా రానున్న ఈ సినిమాకు (చ%ఉష్ఠుశ్రీఖఙుఖీ%173) సుందర్ సి దర్శకత్వం వహించనున్నారు. ఇది ఒక మాగ్నమ్ ఓపస్ చిత్రమని కమల్ హాసన్ తెలిపారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించిన ఆయన, తన స్నేహితుడు రజినీకాంత్‌తో దిగిన ఫొటోను పంచుకున్నారు. తమ స్నేహాన్ని వర్ణిస్తూ ఓ తమిళ కవితను కూడా పోస్ట్ చేశారు."భారతీయ సినిమాలోని ఇద్దరు మహోన్నత శక్తులను ఈ ప్రాజెక్ట్ ఏకం చేయడమే కాకుండా, కమల్ హాసన్-రజినీకాంత్ మధ్య ఉన్న ఐదు దశాబ్దాల స్నేహానికి, సోదరభావానికి ఇది నిదర్శనం. వారి బంధం ఎందరో కళాకారులకు స్ఫూర్తినిస్తూనే ఉంది" అని రాజ్‌కమల్ ఫిలింస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. తమ సంస్థ 44 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపింది.రజినీకాంత్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, సుందర్ సి



దర్శకత్వ ప్రతిభ, కమల్ హాసన్ నిర్మాణ విలువలు ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళతాయని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ 2027 సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనుంది. ఇటీవల రజినీకాంత్ సినీ పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కమల్ హాసన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా ఆయనతో సినిమా నిర్మిస్తుండటం కోలీవుడ్‌లో పండగ వాతావరణాన్ని సృష్టించింది.




# యువ హీరోలు పూరి ఆకాష్, రోషన్ కనకాల ముఖ్య అథితులుగా ప్రేమిస్తున్నా ప్రీ రిలీజ్ ఈవెంట్ !!!

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 05 : వరలక్ష్మీ పప్పుల ప్రజెన్స్ లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో మచ్రి రవికుమార్ నిర్వాహణలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా నటించారు. ప్రేమిస్తున్నా సినిమా నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను చిత్ర యూనిట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులలతో పాటు యువ హీరోలు పూరి ఆకాష్, రోషన్ కనకాల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో రోషన్ కనకాల మాట్లాడుతూ ఒక సినిమా విడుదల తేది వరుకు వచ్చింది అంటే దాని వెనక ఉన్న కష్టాలు నాకు తెలుసు. ప్రేమిస్తున్నా అందరి ఆశీస్సులతో నవంబర్ 7న విడుదల కానుంది. సాత్విక్ నటన చాలా బాగుంటుంది. డెబ్యూ హీరోలా కాకుండా బాగా చేసాడు. మూవీ యూనిట్ అందరికి బెస్ట్ విషెస్ తెలిపారు. పూరి ఆకాష్ మాట్లాడుతూ హీరో సాత్విక్ తనకు తమ్ముడిలాంటివాడని, చిన్నప్పటి నుండి సాత్విక్ చైల్డ్ యాక్టర్‌గా ఎదిగి, ఇప్పుడు హీరోగా తన మొదటి సినిమా చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందని చెప్పారు. సాత్విక్ ఎన్నో ఆడిషన్లు ఇచ్చి, తన సొంత కష్టం మీద ఎదిగాడని, అతను ఒక నిజమైన నటుడని ప్రశంసించారు. 'ప్రేమిస్తున్నా' టీజర్, పాటలు చూసినప్పుడు సాత్విక్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణ అని, అతని నటన కోసమే సినిమా చూడాలనిపిస్తుందని అన్నారు. దర్శకుడు భానుకి, నిర్మాత కనకదుర్గారావుకి ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. ప్రేమిస్తున్నా



చిత్రం నుండి ఇటీవల సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నా, మరియు చిత్ర ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. 56 సెకెన్స్ నిడివి ఉన్న కంటెంట్ యువతను విపరీతంగా ఆకట్టుకొంటోంది. సినిమా ఎలా ఉండబోతోందో ట్రైలర్ ను చూస్తే అర్థం అవుతుంది, స్వచ్ఛమైన ప్రేమకథతో ఈ సినిమా ఆడియన్స్ ముందుకు రాబోతోంది. ఈ సినిమాలో సాత్విక్ వర్మ, ప్రీతి నేహా పోటీపడి నటించారు. దర్శకుడు భాను ప్రేమిస్తున్నా సినిమాను న్యూ ఏజెడ్ లవ్ స్టోరీగా ఆడియన్స్ కు చూపించబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు భాను మాట్లాడుతూ
"అన్ కండీషనల్ లవ్ తో తెరకెక్కిన సినిమా ప్రేమిస్తున్నా. ఇప్పటివరకు తెలుగులో అంత అన్ కండీషనల్ లవ్ తో ఏ సినిమా రాలేదు, అద్భుతమైన పాటలు, పర్ఫార్మెన్స్ తో ఈ చిత్రం నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల కానుంది. చాలా కాలం తరువాత వస్తోన్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఈ సినిమా, మేము విడుదల చేసిన ట్రైలర్ కు ఆడియన్స్ నుండి సూపర్బ్ రెస్పాన్స్ లభిస్తోందని" అన్నారు. ఇదొక మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భాస్కర్ శ్యామల ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ అందించారు. అనిల్ కుమార్ అచ్చుగట్ల ఈ సినిమాకు సంభాషణలు రాయడం జరిగింది. ఈ సినిమాకు నిర్వహణ మచ్రి రవికుమార్, ఎడిటర్ శిరీష్ ప్రసాద్.

# టాలీవుడ్‌ను చూసి బాలీవుడ్ ఎంతో మారాలి: సోనాక్షి సిన్హా



బాలీవుడ్ ప్రముఖ నటి సోనాక్షి సిన్హా 'జటాధర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనివిధానాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది పరిశ్రమలో ఉండే సమయపాలన, క్రమశిక్షణను ప్రశంసించిన ఆమె, ఈ విషయంలో బాలీవుడ్ చాలా నేర్చుకోవాలని సూచించారు.ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, "నేను గతంలో తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేశాను. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. దక్షిణాది సినీ పరిశ్రమలో కొన్ని విషయాలు నాకు బాగా నచ్చాయి, ముఖ్యంగా ఇక్కడి సమయపాలన అద్భుతం. టాలీవుడ్‌లో ఉదయం 9 గంటలకు షూటింగ్ మొదలైతే సాయంత్రం 6 గంటల కల్లా కచ్చితంగా పూర్తిచేస్తారు. దీనికి ఎంతో క్రమశిక్షణ అవసరం. కానీ హిందీ పరిశ్రమలో ఇలాంటి వాతావరణం ఉండదు. అక్కడ సమయపాలన పాటించరు, అర్ధరాత్రి వరకు షూటింగ్‌లు జరుగుతూనే ఉంటాయి. ఆ పద్ధతి నాకు అస్సలు నచ్చదు. ఈ విషయంలో టాలీవుడ్‌ను చూసి హిందీ వాళ్లు మారాలని కోరుకుంటున్నాను" అని సోనాక్షి సిన్హా స్పష్టం చేశారు.గతంలో ప్రాంతీయ భాషా చిత్రాల్లో నటించాలని ఆసక్తి ఉన్నప్పటికీ, డేట్లు సర్దుబాటు కాకపోవడం వల్లే కుదరలేదని ఆమె గుర్తుచేసుకున్నారు.
ఇక 'జటాధర' విషయానికొస్తే, ఈ చిత్రంలో నవ దళపతి సుధీర్ బాబు హీరోగా నటిస్తున్నారు. పాన్-ఇండియా ద్విభాషా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్ తదితరులు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా నవంబర్ 7న థియేటర్లలో విడుదల కానుంది.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja,
www.simhagarjana.com

# గిరిజన 'గూడెం'లో తొలిసారి

# విద్యుత్ కాంతులు




- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో స్వాతంత్ర్యం తరవాత విద్యుత్ వెలుగులు చూసిన రొంపల్లి పంచాయతీ పరిధిలోని 'గూడెం' గ్రామస్తులు
- కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర విద్యుత్ శాఖ సాయంతో పనులు
- 17 కుటుంబాలున్న గిరి శిఖర గ్రామానికి సుమారు 9.6 కిలో మీటర్ల మేర 217 విద్యుత్ స్తంభాలు
- ప్రతీ ఇంటికీ 5 బల్బులు, ఒక ఫ్యాన్ ఏర్పాటు -- పవన్ కళ్యాణ్ కి పాలాభిషేకం చేసిన గిరి పుత్రులు











యలమంచిలి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 05 : ప్రపంచానికి దూరంగా విసిరేసినట్టు అడవిలో ఉండే 'గూడెం' అనే గ్రామం అది. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, రొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. గూడెం గ్రామ ప్రజల ఇళ్ళలో నేటి వరకూ విద్యుత్ వెలుగులు లేవు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలైనా వారు పడుతున్న వెతలు బాహ్య ప్రపంచానికి తెలియవు. అలాంటి గిరిపుత్రుల సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మనసుతో అర్ధం చేసుకున్నారు. ఐదు నెలల్లోనే ఆ గిరిజన గ్రామంలో వెలుగులు నింపారు. గిరిపుత్రుల ముఖాల్లో ఆనంద కాంతులు వెల్లివిరిసేలా చేశారు. బుధవారం ఆ గ్రామంలో ఉన్న 17 ఇళ్ళకీ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. కార్తీక పౌర్ణమి రోజున బయట వెన్నెల కాంతులు... గూడెం ప్రజల ఇళ్ళలో విద్యుత్ కాంతులు విరుస్తున్నాయి.

- ఉప ముఖ్యమంత్రికి వినతులు

అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, రొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గూడెం గ్రామం ఉంది. మండల కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో 17 ఆవాసాలతో ఉంది ఆ గ్రామం. గూడెంలో నివసించే గిరిపుత్రులకు రోడ్లు, రక్షిత తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు అందటం లేదు. బాహ్య ప్రపంచంతో వీరి సంబంధాలు అంతంత మాత్రమే. పగటి వేళల్లో ఉపాధి కోసం బయటకు వచ్చే గూడెం గ్రామస్తులు, రాత్రిళ్లు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీసేవారు. అడవి జంతువులు వచ్చి తమ ఊరి మీద పడతాయేమోనని భయంతో బతికేవారు. గతంలో ఎన్నోమార్లు అధికారులకు తమ సమస్యను చెప్పుకొన్నా పరిష్కారం లభించలేదు. అయిదు నెలల కిందట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తమ సమస్యను తీసుకువచ్చారు. అడవితల్లి బాటతో గిరిపుత్రుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న మీరు మా గ్రామంలో విద్యుత్ కాంతులు నింపమంటూ కోరారు. తన ముందుకు వచ్చిన సమస్యను పరిష్కరించి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని అల్లూరి జిల్లా కలెక్టర్ కి స్పష్టం చేశారు. 17 ఆవాసాల కోసం 9.6 కిలోమీటర్ల పొడవునా అడవులు, కొండల్లో విద్యుత్ లైన్లు వేయాలి. సుమారు రూ. 80 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో వారికో దారి చూపేందుకు ముందున్న దారులను పవన్ కళ్యాణ్ వెతికారు. ఈ సమస్యను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఏపీ జెన్కో సీఎండీలకు తెలియచేశారు. అవసరం అయితే కేంద్ర ప్రభుత్వ సాయం తీసుకుని తక్షణం సమస్య పరిష్కరించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనతో భారత ఇంధన మంత్రిత్వశాఖ పరిధిలోని నాన్ పీవీజీటీ పథకం ద్వారా ఆ గిరిజన గ్రామంలో విద్యుత్ శాఖ వెలుగులు నింపింది.

- 9.6 కి.మీ... 217 స్తంభాలు

రూ.80 లక్షల పైగా అంచనా వ్యయంతో సుమారు 9.6 కిలోమీటర్ల మేర, 217 విద్యుత్ స్తంభాలు వేసుకుంటూ వెళ్లి 17 ఆవాసాలకు విద్యుత్ సరఫరా ఇచ్చారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా సోలార్ ప్యానళ్లు కూడా ఏర్పాటు చేసి ప్రత్యేక ట్రాన్స్ ఫార్మర్ కి అనుసంధానించారు. గూడెం గ్రామానికి విద్యుత్ లైను వేసేందుకు విద్యుత్ శాఖ ఒక యజ్ఞమే చేసింది. విద్యుత్ స్తంభాల రవాణా, పాతడం వంటి పనులు అత్యంత క్లిష్ట పరిస్థితుల మధ్య పూర్తి చేశారు. మానవ వనరులను ఉపయోగించి స్తంభాలు రవాణా చేయడం, రాతి కొండలను తవ్వేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మొదలు పెట్టిన 15 రోజుల్లోనే పనులు విజయవంతంగా పూర్తి చేశారు. పీఎం జన్మన్ పథకం కింద రూ.10.22 లక్షలతో సోలార్, పవన విద్యుత్ తో కూడిన హైబ్రిడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గిరిజన గ్రామాల్లో మొట్టమొదటిసారి ఈ తరహా గ్రిడ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికీ ఐదు బల్బులు, ఒక ఫ్యాన్ కూడా అందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రజలు నివసించే శిఖర ప్రాంతంలో విద్యుత్ వెలుగులను నింపేలా నిధులు కేటాయించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తుందని చెప్పడానికి గూడెం గ్రామంలోని ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయడమే నిదర్శనం అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొని గూడెం గ్రామంలో విద్యుత్ వెలుగులు నింపడానికి సహకరించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీసీపీఎల్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వి తేజ, విద్యుత్ శాఖ సిబ్బందికి ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు.

గూడెం గ్రామంలో హర్షాతిరేకాలు

కనీసం సౌకర్యాలు లేని, విద్యుత్ కాంతులు లేని గూడెం గ్రామ గిరిజనులు బుధవారం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ వేడుకగా ఉన్నారు. తమ గ్రామంలో మొట్టమొదటిసారి విద్యుత్ వెలుగులు చూసిన గూడెం ప్రజలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమ గ్రామానికి విద్యుత్ లైను వేయించి, తమ ఇళ్ళలో విద్యుత్ కాంతులు నింపిన పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ గ్రామాన్ని యలమంచిలి శాసన సభ్యుడు సుందరపు విజయ్ కుమార్, అరకు నియోజక వర్గం జనసేన నాయకులు, జన సైనికులు సందర్శించారు. కనీసం రహదారి సౌకర్యం లేని ఆ గిరి శిఖర గ్రామానికి ట్రాక్టర్ సాయంతో ప్రయాణించి మరీ చేరుకున్నారు. ఆ గ్రామస్తుల ఆనందోత్సాహాల్లో భాగమయ్యారు.





